

టన్ను చీనీ రూ.17,150
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17,150 పలికాయి. మార్కెట్‌కు 710 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.23
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.8°/23.2°
జిల్లా పరిధిలో సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ, ఇతర అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) ద్వారా 2024–25 సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్, జిల్లా కోఆర్డినేటర్ లాజరు, నాగరాజు తదితరులతో కలిసి ప్రవేశాలకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతి, 15 ఏళ్లు పూర్తయిన వారు ఇంటర్ చేరేందుకు అర్హులన్నారు. ఆగస్టు 27వ తేదీ వరకూ దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు. రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సుల్లో చేరే వారికి ఉచిత పాఠ్యపుస్తకాలు, సులభమైన అభ్యసన సామాగ్రి ఇంటికే పంపనున్నట్లు వెల్లడించారు. అలాగే జ్ఞానదాత యూట్యూబ్ ఛానల్, ఏపీ ఓపెన్ స్కూల్ .ఏపీ. గోవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కంటెంట్ సదుపాయం ఉంటుందన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, మాజీ సైనికోద్యోగులకు అడ్మిషన్ ఫీజు రాయితీ ఉంటుందన్నారు.

ఆంధ్రా ఘన విజయం



ఏపీ జట్టు క్రీడాకారులు

అనంతపురం: బిహార్‌పై ఆంధ్రా జట్టు ఘనవిజయం సాధించింది. జూనియర్ బాలికల జాతీయ స్థాయి ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా సోమవారం ఆర్డీటీ స్టేడియంలో బిహార్– ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగింది. ఆంధ్రప్రదేశ్ మూడు గోల్స్ సాధించగా, బిహార్ జట్టు ఒక గోల్ కూడా కొట్టలేక పోయింది. ఆంధ్రా క్రీడాకారిణులు సాయి వర్షిత, వి. నందిని, టి. అరుణ ఒక్కో గోల్ చేశారు.

- మధ్యాహ్నం జార్ఖండ్– హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మధ్య జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ విజయకేతనం ఎగురవేసింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో జార్ఖండ్ జట్టు 25 గోల్స్ చేయగా, హిమాచల్ ప్రదేశ్ ఖాతా తెరవలేక పోయింది.

చక్కెర చేదు.. పప్పు లేదు!

నిరుపేదలకు తక్కువ ధరకే నిత్యావసరాలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజాపంపిణీ వ్యవస్థను కూటమి సర్కార్ అస్తవ్యస్తం చేసింది. కార్డుదారులకు రాయితీతో ఇవ్వాల్సిన కందిపప్పు, చక్కెరకు పూర్తిగా కోత పెట్టింది. కేవలం బియ్యం ఇస్తూ గంజి కాచుకుని తాగమంటోంది. ఇక కూటమి పార్టీల నేతలు రేషన్‌డీలర్లుగా తమ వారిని నియమించుకునేందుకు కొన్ని చోట్ల పాత డీలర్లు రేషన్ పంపిణీ చేయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో బియ్యం కూడా అందని పరిస్థితి నెలకొంది.

- అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ
- రెండు నెలలుగా బియ్యంతోనే సరి
- స్టోర్లలో కనిపించని కందిపప్పు, పంచదార
- బహిరంగ మార్కెట్‌లో కొనలేకపోతున్న జనం
- బలవంతంగా రేషన్ డీలర్ల తొలగింపు



1,367	జిల్లాలో రేషన్ దుకాణాలు
5,62,784	రేషన్ కార్డుల సంఖ్య
8,700 (మెట్రిక్ టన్నుల్లో)	ప్రతి నెలా పంపిణీ చేసే బియ్యం
5,72,517 (కిలోలు)	ప్రతి నెలా పంపిణీ కావాల్సిన కందిపప్పు
5,72,517 (కిలోలు)	ప్రతి నెలా పంపిణీ కావాల్సిన గోధుమపిండి

సాక్షి, పుట్టపర్తి

కూటమి సర్కార్ నిరుపేదలను నానా తిప్పలు పెడుతోంది. సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అటకెక్కిస్తూ పస్తులు పెడుతోంది. ముఖ్యంగా నిరుపేదల కడుపు నింపే ప్రజా పంపిణీ వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. గతంలో వైఎస్ జగన్ సర్కార్ కార్డుదారులకు బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేసే వ్యవస్థకు స్వస్తి పలకాలని నిర్ణయించింది. అంతేకాకుండా వివిధ కారణాలతో కార్డుదారులకు పంచదార, గోధుమపిండి, కందిపప్పు పంపిణీ నిలిపివేసింది. రెండు నెలలుగా బియ్యంతోనే సరిపెడుతోంది. అది కూడా రేషన్ దుకాణం వద్దకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో కందిపప్పు కొనలేకున్నామని పేదలు వాపోతున్నారు.

నిత్యావసరాల ధరలు ఇలా...		
నిత్యావసర వస్తువులు	చౌక దుకాణాల్లో	బయట మార్కెట్‌లో
పంచదార (అరకిలో)	రూ.17.5	రూ.22
కందిపప్పు కిలో	రూ.67	రూ.185
గోధుమపిండి కిలో	రూ.16	రూ.60

ఆదాయ మార్గాలపై కన్ను..

రేషన్ డీలర్‌షిప్ కోసం జిల్లాలోని తెలుగు తమ్ముళ్లు పోటీ పడుతున్నారు. పేదలకు ఇవ్వాల్సిన సరుకులు ఇవ్వకుండా బ్లాక్‌లో విక్రయించి ఆర్జించాలనే లక్ష్యంతో అడ్డదారులు తొక్కుతున్నారు. ఇందు కోసం ఎవరికి వారుగా ఎమ్మెల్యేల వద్ద లాబీయింగ్ చేస్తున్నారు. ఫలితంగా కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. తమ్ముళ్ల కుమ్ములాటలో ఒక్కో పంచాయతీలో కార్డుల ఆధారంగా రెండు నుంచి మూడు రేషన్ దుకాణాలు వెలిశాయి. దీంతో తమ కార్డు ఏ దుకాణం పరిధిలో ఉందో? ఏ దుకాణం వద్దకు వెళ్లాలో తెలియక నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారు.

బలవంతంగా తొలగింపు..

జిల్లా 5,62,784 కార్డులుండగా, వీరికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 1,367 రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా నిరుపేదలకు ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందజేసేది. అయితే కూటమి అధికారంలోకి రాగానే.. చాలా చోట్ల డీలర్లను తొలగించారు. కొత్తగా టీడీపీ మద్దతుదారులను డీలర్లుగా నియమించారు. వారు తమకిష్టమొచ్చిన సమయంలో, తమకు అనుకూలమున్న ప్రాంతంలో రేషన్ పంపిణీ చేస్తున్నారు. దీంతో రేషన్ సరుకులు తీసుకునేందుకు నిరుపేదలు పనులు మానుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గట్టిగా ప్రశ్నిస్తే అధికారంలో తమ పార్టీ ఉందని.. తమకు ఇష్టం వచ్చినప్పుడు రేషన్ సరుకులు పంపిణీ చేస్తామంటున్నారు. ఇంకా పాత డీలర్లే కొనసాగుతున్న చోట్ల నిత్యావసరాల పంపిణీని టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. ఫలితంగా నిరుపేదలను పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

కొనలేని పేదలు..

గతంలో చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు అరకిలో చక్కెర రూ.17.50కే ఇచ్చేవారు. కిలో కందిపప్పు రూ.67కే ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయడం లేదు. బయట కొందామంటే రేట్లు విపరీతంగా ఉంటున్నాయని పేదలు వాపోతున్నారు. కిలో చక్కెర రూ.42 పైగా ఉంటోంది. కందిపప్పు కిలో రూ.185 పలుకుతోంది. దీంతో చాలామంది పేదలు కందిపప్పు కొని తినలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ పంపిణీని రాజకీయం చేయడం మాని, నిరుపేదలందరికీ నిత్యాసర సరుకులు అందించాలని జనం వేడుకుంటున్నారు.

ధరలు ఎక్కువగా ఉన్నాయి



రేషన్ షాపుల్లో బియ్యం తప్ప మిగతా సరుకులు ఇవ్వడం లేదు. ఆ సరుకులు బయట కొందామంటే విపరీతమైన ధరలు ఉన్నాయి. పేదల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం స్పందించి గోధుమపిండి, చక్కెర, కందిపప్పు పంపిణీ చేయాలి. – విజయమ్మ, ఆర్.అనంతపురం, మడకశిర మండలం

రెండు నెలలుగా ఇవ్వలేదు



మా ఊళ్లో రెండు నెలలుగా కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. పంచదార, కందిపప్పు, గోధుమపిండి ఇవ్వడం లేదు. రేషన్ బండి రావడం లేదు. చౌక దుకాణం వద్దకు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నాం. అధికారులు స్పందించి.. అన్ని సరుకులు ఇవ్వాలి.
– కొండయ్య, రాగినేపల్లి, తనకల్లు మండలం

కందిపప్పు కొనలేకున్నాం



గతంలో ప్రతి నెలా రేషన్ దుకాణంలోనే కందిపప్పు తీసుకెళ్లే వాళ్లం. రెండు నెలల నుంచి కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు, చక్కెర, గోధుమపిండి రాలేదని చెబుతున్నారు. బయట ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కందిపప్పు కొనలేని పరిస్థితి ఏర్పడింది. – తులసీరామ్ నాయక్, నాగినాయనిచెరువు తండా, సోమందేపల్లి

పైనుంచి రాలేదన్నారు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదు. అడిగితే పైనుంచి రాలేదని చెబుతున్నారు. డీలర్ కూడా మారడంతో ఏమీ అడగలేని పరిస్థితి. వాళ్లు చెప్పిన దగ్గరకు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నాం.
– చిన్న రంగనాయకులు, యర్రాయపల్లి, బత్తలపల్లి మండలం

రేషన్ షాపు వద్దకే వెళ్లాల్సి వస్తోంది



గడిచిన ఐదేళ్లు మా ఇంటి వద్దకే ఎండీయూ వాహనాలు వచ్చి రేషన్ సరుకులు అందజేసేవి. కానీ రెండు నెలలుగా చౌక దుకాణం వద్దకే వెళ్లాల్సి వస్తోంది. అక్కడి నుంచి మోసుకురావడం ఇబ్బందిగా ఉంది. పైగా మిగతా అదనపు సరుకులు ఇవ్వడం లేదు. గట్టిగా అడిగితే ప్రభుత్వం పంపలేదని చెబుతున్నారు.
– లక్ష్మీరెడ్డి, కంచరోళ్లపల్లి, అమడగూరు మండలం

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- అధికారులకు డీఆర్ఓ కొండయ్య ఆదేశం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 196 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని డీఆర్ఓ కొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమానికి వివిధ సమస్యలపై 196 అర్జీలు రాగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. త్వరలో జరగనున్న స్వాతంత్య్ర వేడుకలకు యంత్రాంగం సమాయత్తం కావాలన్నారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం నాటికి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. అలాగే మంత్రి సందేశ పత్రాన్ని సంక్షిప్తంగా, సమగ్రంగా ఉండేలా చూడాలన్నారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని ఇలా:



శేషాద్రిరెడ్డి, మార్లపల్లి

- పుట్టపర్తి మండలం మార్లపల్లి గ్రామంలో సర్వే నంబర్ 259–3లో తమకు 3.63 ఎకరాల భూమి ఉండగా మామిడి తోట సాగు చేస్తున్నానని శేషాద్రిరెడ్డి తెలిపారు. కొందరు వ్యక్తులు ఇప్పటికి నాలుగు సార్లు సరిహద్దు బండలు, డ్రిప్పు, గేట్ వాల్వులు, ఫిల్టర్, పైపులు ధ్వంసం చేశారని, దీంతో తనకు రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగిందని డీఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం, రూరల్ పోలీసులకు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

టీబీ డ్యాం @ 100 టీఎంసీలు

బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 100.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఆదివారం 1,32,202 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి 82,780 క్యూసెక్కులకు తగ్గింది. 12 క్రస్ట్ గేట్లు రెండు అడుగులు ఎత్తి 50,156 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 100.410 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,631.65 అడుగులకు నీరు చేరింది. మరోవైపు, హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,360 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

పరిటాల సునీత అనుచరుల దౌర్జన్యకాండ

- దళితరైతు పొలంలో చీనీచెట్లు దున్నివేత
- రామగిరి మండలం కొత్తగాదిగకుంటలో ఘటన
- ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు
- తమ భూములకు రక్షణ కల్పించాలని వినతి



ఫిర్యాదు ప్రతిని చూపుతున్న దళిత రైతులు

పుట్టపర్తి టౌన్: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అనుచరుల దౌర్జన్యాలకు అంతేలేకుండా పోయింది. చివరకు 30 ఏళ్లుగా ఓ దళితరైతు సాగు చేసుకుంటున్న భూములను లాక్కున్నారు. చీనీచెట్లు దున్నివేశారు. దీంతో బాధితులు పెద్దక్క, శివయ్య సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. తాము భూమిలోకి వెళ్లేందుకు రక్షణ కల్పించాలని 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు ఎస్పీ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడారు. తమది రామగిరి మండలం కొత్తగాదిగకుంట గ్రామమని, తాము 30 ఏళ్లుగా సాగులో ఉన్న భూముల్లో రెండు బోర్లు వేసుకొని పంటలు సాగుచేసుకుంటున్నామని వెల్లడించారు. అందులో 530 చీనీచెట్లు 3 ఎకరాల్లో అనుప పంట సాగుచేసుకుంటున్నామన్నారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు ఆ భూమి తమదంటూ కోర్టులో దావా వేశారన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులన్నీ తమకే అనుకూలంగా ఉన్నాయని, ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోందని వివరించారు. అయితే 10 రోజుల క్రితం ఎమ్మెల్యే పరిటాల సునీత అండదండలతో ఆమె అనుచరులు నలుగురు వచ్చి ఆ భూమి తమదని దౌర్జన్యం చేశారన్నారు. అంతేకాకుండా తాము సాగు చేస్తున్న పంటలను యంత్రాలతో దున్ని వేశారని, వ్యవసాయ పరికరాలనూ ధ్వంసం చేసి భూ ఆక్రమణకు పాల్పడ్డారని వాపోయారు. తాము ఫిర్యాదు చేయగా, రామగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు మాత్రం నమోదు చేశారని, ఇప్పటి వరకు స్పందన లేదని బాధితులు పెద్దక్క, శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డులన్నీ తమకు అనుకూలంగా ఉన్నాయని, వాటిని పరిశీలించి భూమిలోకి వెళ్లే విధంగా రక్షణ కల్పించాలని అడిషనల్ ఎస్పీ విష్ణును కోరామని తెలిపారు.

- అంతకుముందు వారు కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి వెళ్లి డీఆర్‌ఓను కలిశారు. ఇటీవల గ్రామానికి చెందిన రామలింగప్ప, నాగలింగ, పోతన్నలు తమ పొలం ఆక్రమించి పంట తొలగించారని, డ్రిప్పు సామగ్రి ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- చిరుద్యోగులను వేధిస్తున్న కూటమి సర్కార్
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ధ్వజం
- అంగన్‌వాడీలపై దౌర్జన్యానికి నిరసనగా కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వస్తున్న సీఐటీయూ నాయకులు, చిరుద్యోగులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, సాధికారత సాధిస్తామని అసెంబ్లీలో నీతి వాక్యాలు వల్లిస్తున్న సీఎం చంద్రబాబు... బయట మాత్రం చిరుద్యోగులను వేధిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు విమర్శించారు. ఓడీచెరువు మండలం వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం, మరో కార్యకర్త సుహాసినిపై దాడి చేసిన టీడీపీ కార్యకర్త ఆంజనేయులు కుటుంబంపై ఇంత వరకూ ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంతో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వచ్చి బైఠాయించారు. సుమారు రెండు గంటల పాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, శ్రీదేవి, ఐద్వా నాయకులు నాగమణి, జిల్లా కార్యదర్శి మాబున్నీషా, తదితరులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను, వెలుగు కార్మికులను, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను, మున్సిపల్ కార్మికులను తదితర చిరుద్యోగులను ఉన్నఫళంగా తీసేయడం తగదన్నారు. పోస్టు వదిలేయకపోతే దాడులు చేయడం, వేధించడం వంటివి చేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర మామ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చర్చలకని పిలిచి ఆంజనేయులు ముందే తమను అవమానించారన్నారు. ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడి చేసినా ఇంత వరకూ ఎటువంటి చర్యలూ తీసుకోకుండా వెనకేసుకు రావడం దారుణమన్నారు. మహిళలపై ఇన్ని దాడులు గరుతున్నా హోం మంత్రి అనితకు చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి మాట్లాడుతూ, తనను చంపి అంగన్‌వాడీ పోస్టును రూ.2 లక్షలకు అమ్ముకోదలచిన ఆంజనేయులు, తమ్ముడు వెంకటేష్ కుటుంబంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కలెక్టర్‌కు, ఎస్పీకి, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఆంజనేయులు కుటుంబంపై చర్యలు తీసుకోలేదన్నారు.

పెన్షన్‌దారులతో సర్కార్ చెలగాటం

పుట్టపర్తికి చెందిన రామయ్య విశ్రాంత ఉద్యోగి. పిల్లలంతా ఇతర ప్రాంతాల్లో స్థిరపడగా, పుట్టిపెరిగిన ఊరిని వదల్లేక భార్యతో ఇక్కడే ఉండిపోయాడు. ఇన్నాళ్లూ ఆత్మగౌరవంతో జీవించిన రామయ్య పదవీ విరమణ తర్వాత బిడ్డలపై ఆధారపకుండా తనకొచ్చే పెన్షన్‌తో జీవనం సాగిస్తున్నాడు. తనకు, తన భార్యకు కావాల్సిన మందులు, ఇంటి ఖర్చులకు పెన్షన్ సొమ్మే ఆధారం. హృద్రోగం, బీపీ, షుగర్‌తో బాధపడుతున్న ఆయన ప్రతి నెలా ఒకతేదీనే మందులు తెచ్చుకుంటాడు. ఈనెల పెన్షన్ సొమ్ము 5వ తేదీ నాటికీ రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉద్యోగులకు 1వ తేదీ జీతం వేసిన సర్కార్... తనలాంటి పదవీ విరమణ పొందిన వారిని విస్మరించడం అన్యాయమంటున్నాడు. తన సేవలకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు ఇదేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

...జిల్లాలోని ఎందరో పెన్షన్ దారులు సకాలంలో తమ పెన్షన్ డబ్బు జమ కాక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులకు చేయిచాచలేక దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

- నేటికీ ఖాతాల్లో జమ కాని పెన్షన్ సొమ్ము
- మందులకూ ఇబ్బంది పడుతున్న వృద్ధులు
- 60 ఏళ్ల సేవలకు ఇదేనా గుర్తింపు అంటూ మండిపాటు

పుట్టపర్తి: ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులందరికీ పెన్షన్ సొమ్మే ఆధారం. అనారోగ్యం సంభవించినా, రోజువారీ మందులకైనా, కుటుంబ పోషణకైనా ఆ డబ్బుతోనే. కానీ కూటమి సర్కార్ సకాలంలో పెన్షన్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోంది. ఫలితంగా విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

హామీలన్నీ గాలికి..

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి నెల 1వ తేదీనే ఠంచనుగా జీతాలు, పెన్షన్ సొమ్ము ఖాతాల్లో జమ చేస్తామని ఎన్నికలకు ముందు ప్రతి మీటింగ్‌లోను కూటమి నేతలు ఊదరగొట్టారు. కానీ అధికారంలోకి వచ్చాక హామీలన్నీ గాలికి వదిలేసింది. ముఖ్యంగా పెన్షన్లపై కనీసం దృష్టి సారించలేదు. దీంతో గత నెలలోనూ చాలా మందికి 10వ తేదీ తర్వాతే పింఛన్ అందింది. ఈనెల 5వ తేదీ నాటికీ జిల్లాలోని జిల్లాలోని 8,200 పెన్షనర్లకు సొమ్ము జమ కాలేదు. దీంతో వారంతా తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

హామీలను తుంగలో తొక్కారు



ఎన్నికల వేళ అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. రెండు నెలలైనా ఒక్క హామీ సరిగా అమలు చేయడం లేదు. ముఖ్యంగా 1వ తేదీనే పెన్షన్ సొమ్ము జమ చేయకుండా విశ్రాంత ఉద్యోగులను ఇబ్బందులు పెడుతోంది. 2019కు ముందు ఏం జరిగిందో ఈ ఐదేళ్లలో కూడా అదే జరుగుతోంది. ఓట్లేసి మోసపోయామని ఇప్పటికే అన్నివర్గాలలో ఆందోళన మొదలైంది.
– అదపాల వేమనారాయణ, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు

ఇబ్బంది పెట్టడం భావ్యం కాదు



వృద్ధాప్యంలో మాకు పెన్షన్ సొమ్మే ఆధారం. కుటుంబ పోషణతో పాటు రోజువారీ మందులకూ ఆ డబ్బు గురించి ఎదురుచూస్తాం. ఇంతమందికి ఇన్ని చేస్తున్న ప్రభుత్వం పెన్షనర్లను ఇబ్బంది పెట్టడం సరి కాదు. 5వ తేదీ దాటినా పెన్షన్ రాకపోతే మా పరిస్థితి ఎలా ఉంటుందో వారూ అర్థం చేసుకోవాలి.
– శంకరనారాయణ, విశ్రాంత హెచ్‌ఎం, గోరంట్ల

1వ తేదీనే పెన్షన్ జమచేయాలి



కూటమి నేతలు ప్రతి మీటింగ్‌లోనూ ప్రతి నెలా 1వ తేదీనే పెన్షన్ ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. కానీ 5వ తేదీ నాటికీ ఎవరికీ పింఛన్ అందలేదు. సామాజిక పింఛన్లు ఇచ్చామని గొప్పగా చెబుతున్న సర్కార్...60 ఏళ్లు ప్రజా సేవ చేసిన మమ్మల్ని మాత్రం ఇబ్బంది పెడుతోంది. చేతిలో చిల్లిగవ్వలేక రోజూ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడమే పనిగా మారింది. ఉద్యోగులకు ఇచ్చినట్లుగా మాకూ 1వ తేదీనే పెన్షన్ ఖాతాలో జమ చేయాలి.
– వెంకటరత్నం విశ్రాంత ఉపాధ్యాయుడు, పుట్టపర్తి



చిరుధాన్యాల సాగుపై మక్కువ


ఓడీ చెరువు మండలం కొండకమర్ల వద్ద సాగు చేసిన సజ్జ పంట


అమడగూరు వద్ద సాగు చేసిన రాగి పంట


మడకశిర వద్ద సాగు చేసిన కొర్ర పంట

- జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం
- 4,220 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు

పుట్టపర్తి అర్బన్: సంప్రదాయ పంటల సాగును వదిలి చాలా మంది రైతులు చిరుధాన్యాల సాగుతో లాభాలు గడిస్తున్నారు. కొంత కాలంగా వేరుశనగలో వివిధ రకాల విత్తనాలు సాగు చేస్తున్నా చీడపీడలతో ఆశించినంతగా పంట దిగుబడులు రాలేదు. కంది, మొక్కజొన్న, పొద్దు తిరుగుడుకు సైతం చీడపీడలు అధికంగా వస్తుండడం, సకాలంలో వర్షాలు కురవక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నీటి లభ్యత ఉన్న రైతులు రాగి, కొర్ర, సజ్జ వంటి పంటల సాగు చేపట్టారు. పుట్టపర్తి, కదిరి నియోజక వర్గాల్లో సజ్జ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 2,500 ఎకరాలు కాగా, కేవలం సజ్జ పంట ఒక్కటే 1,415 ఎకరాల్లో సాగులోకి రావడం గమనార్హం. సజ్జ క్వింటా రూ.2800 నుంచి రకాన్ని బట్టి రూ.4వేల వరకూ ధర పలుకుతోంది. పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ, ఓడీ చెరువు మండలాల్లో విస్తారంగా సీడు సజ్జ సాగు చేస్తున్నారు. కొన్ని కంపెనీలు సీడు ఇచ్చి పంట పూర్తయిన తరువాత కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో సీడు సజ్జ సాగు విస్తీర్ణం పెరిగింది.

10 వేల ఎకరాల్లో రాగి సాగు లక్ష్యం..

చిరుధాన్యాల్లో ప్రతి ఒక్కరికీ అత్యవసరమైనది, అత్యంత ఆరోగ్యకరమైనదిగా రాగులకు గుర్తింపు ఉంది. గత ప్రభుత్వం సైతం రాగి పంట విస్తీర్ణం పెంచాలనే లక్ష్యంతో గిట్టుబాటు ధరలు కల్పించడంతో రైతులు ఆ దిశగా ఆలోచించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 10 వేల ఎకరాల్లో రాగి పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటి వరకూ 2,580 ఎకరాల్లో పంట వేశారు. ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముందని వ్యవసాయాధికారులు అంటున్నారు. రాగుల ధర సుమారు రూ.4 వేల వరకూ పలుకుతోంది.

224 ఎకరాల్లో కొర్ర..

అత్యంత ఆరోగ్యకరమైన మరో చిరుధాన్యం కొర్ర పంటను జిల్లాలో ఇప్పుడిప్పుడే సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తుండడంతో కొర్ర పంటను అధికంగా ముదిగుబ్బ, మడకశిర, పెనుకొండ తదితర మండలాల్లో సాగు చేస్తున్నారు. 1,667 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకూ 225 ఎకరాల్లో కొర్ర సాగు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం క్వింటా కొర్రలు సుమారు రూ.10 వేల వరకూ అమ్ముడుపోతోంది. తక్కువ నీటికే పంట పూర్తి కానుండడంతో కొర్ర సాగుకు రైతులు ముందుకు రావాలని అధికారులు పిలుపునిస్తున్నారు.

ఏటా సజ్జ పంటనే...



నాకున్న 4 ఎకరాల్లో ఏటా సజ్జ పంటనే సాగు చేస్తుంటా. దిగుబడి కూడా అధికంగా ఉంటోంది. ఈ సారి సీడు సజ్జకు మంచి గిట్టుబాటు ధరనిస్తున్నారు. పక్షుల బెడద తప్పా ఇంకా ఏ ఇతర ఇబ్బందులూ ఉండవు. ప్రస్తుతం క్వింటా సజ్జ మార్కెట్‌లో రూ.2,800 నుంచి రూ.4 వేల వరకూ అమ్ముడుపోతోంది.
– నరసింహ, మీసాలవాండ్లపల్లి, నల్లమాడ మండలం

అధిక ఆదాయం



చిరుధాన్యాల సాగుతో లాభాలు పుష్కలంగా ఉంటాయి. చిరుధాన్యాల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వీటికి చీడపీడలు బెడద ఉండదు. ప్రస్తుతం ప్రజలు కూడా బియ్యానికి బదులు చిరుధాన్యాల వంటలనే ఎక్కువగా ఇష్టపడుతున్నారు.
– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి, పుట్టపర్తి

సిజేరియన్ వికటించి బాలింత మృతి

పెనుకొండ: సిజేరియన్ వికటించి ఓ బాలింత మృతి చెందింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పెనుకొండకు చెందిన బోయ బావయ్య భార్య వాణి (33) పురిటి నొప్పులతో బాధపడుతూ ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ప్రసవం కష్టం కావడంతో ఆమెతో పాటు మరో ఇద్దరికి సోమవారం ఉదయం గైనిక్ వైద్యురాలు సిజేరియన్ చేశారు. మగ బిడ్డకు జన్మనిచ్చిన వాణి ఆరోగ్య పరిస్థితి మధ్యాహ్నం విషమించింది. దీంతో వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆమె మృతి చెందింది. సిజేరియన్ వికటించడం వల్లనే వాణి మృతి చెందినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే విషయంపై ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ మోహన్‌నాయక్ మాట్లాడుతూ... సిజేరియన్‌లో ఎలాంటి పొరబాటు లేదని, ఆపరేషన్ జరిగిన కొన్ని గంటల తర్వాత మానసిక ఒత్తిడి కారణంగా వాణికి ఛాతిలో నొప్పి రావడంతో వెంటనే అనంతపురానికి రెఫర్ చేసినట్లు వివరించారు. అయితే మార్గం మధ్యలోనే ఆమె మృతి చెందడం బాధాకరమన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి


వంశీకృష్ణ (ఫైల్)

గుంతకల్లు: సెల్‌ఫోన్ మాయాజాలంలో చిక్కుకున్న ఓ యువకుడు రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని సత్యనారాయణపేట రైల్వే మోరీ సమీపంలో నివాసముంటున్న బాలన్న, గీత దంపతుల కుమారుడు వంశీకృష్ణ (28) బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల గుంతకల్లుకు వచ్చిన ఆయన సోమవారం ఉదయం ఇంటి సమీపంలోని పట్టాల వద్దకు బహిర్భూమికని వెళ్లాడు. అనంతరం హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ రైలు వస్తున్న విషయం గుర్తించకుండా పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అప్పటికే అత్యంత సమీపంలోకి వచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'పోలీసు స్పందన'కు 40 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ విష్ణు


పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 40 వినతులు అందాయి. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ విష్ణు స్వయంగా వినతులు స్వీకరించి, సమస్య తీవ్రత అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ సతీస్‌కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఆరుగురు విద్యార్థుల సస్పెన్షన్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మెకానికల్ ఫైనలియర్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులను హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. శనివారం రాత్రి వీరు మెకానికల్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో గొడవకు దిగారు. ఒక విద్యార్థిని గాయపరిచారు. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలోనే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ వెంటనే చర్యలు తీసుకున్నారు. విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం కళాశాలలో సమావేశమైన కమిటీ.. ఘటనకు ఆరుగురు విద్యార్థులు కారణంగా గుర్తించింది. క్రమశిక్షణ చర్యల కింద హాస్టల్ నుంచి వీరిని సస్పెండ్ చేయాలని నిర్ణయించింది. ఫైనలియర్ విద్యార్థులకు నాలుగు నెలల్లో కోర్సు పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్లాస్ వర్క్ సస్పెండ్ చేయకుండా హాస్టల్ నుంచి మాత్రమే సస్పెండ్ చేశారు. గొడవలు పునరావృతమైతే కోర్సు నుంచి కూడా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

రోడ్డుపై ఊసరవెల్లి.. ఆసక్తిగా చూశారు మళ్లీ మళ్లీ





ఉన్నఫళంగా రోడ్డుకు అడ్డంగా ఊసరవెల్లి రావడంతో వాహన చోదకులు ఎంతో ఆసక్తిగా చూడసాగారు. కూడేరు మండలం జల్లిపల్లి వద్ద సోమవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. రంగులు మారుస్తూ జాతీయ రహదారిపై నెమ్మదిగా నడుచుకుంటూ పచ్చిక బయలు సమీపిస్తున్న కొద్దీ ఆకుపచ్చ రంగుకు మారుతూ వెళుతుంటే పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు పోటీ పడ్డారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

పెట్టుబడి సాయం ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో అరకొర వర్షాలతో సాగు చేసిన వేరుశనగ పంటలు వర్షాభావంతో ఊడలు ఎండుబారుతున్నాయని, తక్షణం పెట్టుబడి సాయాన్ని అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బత్తలపల్లి మండలం రాఘవంపల్లి వద్ద రైతు నల్లప్ప సాగు చేసిన వేరుశనగ పంటను ఉమ్మడి జిల్లా సీపీఐ నేతలతో కలసి సోమవారం ఆయన పరిశీలించారు. వేరుశనగ మొక్కలు, ఊడలను పరిశీలించి, మాట్లాడారు. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులు వేరుశనగ పంటపైనే ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. ఈ ఖరీఫ్‌లో ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టి వేరుశనగ పంట సాగు చేపట్టారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు రూ.20వేలు చొప్పున తక్షణ పెట్టుబడి సాయాన్ని అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా పెట్టుబడి సాయం గురించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు రాయితీతో విత్తన పంపిణీ చేయాలన్నారు. తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టుల నీటితో హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువల ద్వారా ఉమ్మడి జిల్లాల్లోని చెరువులన్నింటినీ నింపాలని కోరారు. దీని వల్ల భూగర్భజలాలు పెరిగి రబీలో పంటలకు సాగుకు అనువుగా ఉంటుందన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న సీఎం చంద్రబాబుతో చర్చించనున్నామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సీపీఐ నాయకులు జగదీష్, వేమయ్యయాదవ్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కమతం కాటమయ్య, కార్యదర్శులు మహాదేవ్, మల్లికార్జున, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, ఏఐటీయూసీ రాజారెడ్డి, చేనేత సంఘం కార్యదర్శులు వెంకటనారాయణ, వెంకటస్వామి, పట్టణ కార్యదర్శి రవి, మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యకాసం జిల్లా నాయకులు మాల్యవంతం కుళ్లాయప్ప, పోట్లమర్రి నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి బలవన్మరణం


రాము (ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని తురకపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మేడా రాము(43) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తన భార్య రాధతో కలసి గ్రామంలోని పాఠశాల వద్ద చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకుని రాము జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం రాము కాళ్లకు శస్త్ర చికిత్స జరిగింది. అప్పటి నుంచి రెండు కాళ్లు బలహీనంగా మారి దివ్యాంగుడయ్యాడు. అప్పటి నుంచి పనులు చేసుకోలేక ఇబ్బంది పడుతున్న ఆయన మానసికంగా కుంగిపోయాడు. ప్రతి చిన్న పనికి ఇంట్లో భార్యాపిల్లలపై ఆధారపడాల్సి వచ్చింది. తన పరిస్థితి ఇంతగా దిగజారడంతో తన ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు ఎలా చేయాలో తెలియడం లేదంటూ తెలిసిన వారితో చెప్పుకుని చాలా బాధపడేవాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన సోమవారం ఉదయం తన భార్యను దుకాణంలో ఉంచి భోజనం చేసి వస్తానంటూ ఇంటికి వెళ్లి పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న భార్యాపిల్లలు... ఉరికి విగత జీవిగా వేలాడుతున్న రామును చూసి బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని రాముని కిందకు దించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు ముందు రాము రాసి పెట్టిన ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. తన రెండు కాళ్లు బలహీనంగా మారడంతో ప్రతి పనికీ ఇతరులపై ఆధారాపడాల్సి వస్తోందని, దీంతో జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా అందులో రాసి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చెలరేగిన టీడీపీ కార్యకర్తలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాజకీయ కక్ష సాధింపులు పెరిగిపోయాయి. అకారణంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో పాటు సానుభూతిపరులపై దాడులతో టీడీపీ నాయకులు చెలరేగి పోతున్నారు. సోమవారం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘటనలకు సంబంధించి బాధితులు తెలిపిన మేరకు...


తాటిమాకులపల్లిలో టీడీపీ నేతల దాడిలో గాయపడిన భాస్కరరెడ్డి, కుటుంబసభ్యులు


హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దంపతులు అంజినప్ప, శాంతమ్మ

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు
- జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు

గోరంట్ల: మండలంలోని తాటిమాకులపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భాస్కరరెడ్డి, ఆయన భార్య ఓబులమ్మ, మామ రామకృష్ణారెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడి చేశారు. టీడీపీ నేత రామ్మోహన్‌నాయుడు, భాస్కరరెడ్డి గృహాలు ఎదురెదురుగా ఉంటాయి. ఇంటి ఎదుట చెత్త ఊడ్చే విషయంగా సోమవారం సాయంత్రం ఓబులమ్మతో రామ్మోహన్‌నాయుడు తల్లి కాంతమ్మ గొడవ పడింది. దీంతో అదే రోజు రాత్రి రామ్మోహన్‌నాయుడు, ప్రతాప్ నేరుగా భాస్కరరెడ్డి ఇంట్లోకి చొరబడి దంపతులపై విచక్షణారహితంగా కట్టెలతో దాడి చేశాడు. అడ్డుకోబోయిన ఓబులమ్మ తండ్రి రామకృష్ణారెడ్డిపై కూడా దాడి చేశారు. ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేసి వెళ్లిపోయారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా గోరంట్లలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం హిందూపురానికి తరలించారు.

హిందూపురం: చిలమత్తూరు మండలం దేవకేతేపల్లిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు గోపాలప్ప, ఆయన భార్య శాంతమ్మపై సోమవారం అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అంజినప్ప, ఆయన బంధువులు మూకుమ్మడిగా దాడి చేశారు. గోపాలప్పకు చెందిన స్థలాన్ని అంజినప్ప ఆక్రమించుకోవడంతో దంపతులు అడ్డుకోబోయారు. ఆ సమయంలో కర్రలతో అంజినప్ప, ఆయన కుమారుడు వేణు, తమ్ముడి కుమారుడు బాలు దాడికి తెగబడ్డారు. ఘటనలో గాయపడిన దంపతులు హిందూపురంలోని ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు.

క్లుప్తంగా

అంతర్రాష్ట్ర మోసగాళ్ల అరెస్ట్

తాడిపత్రి రూరల్: బంగారు నగలకు మెరుగు పడతామంటూ మోసం చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిహార్‌లోని రూపాలి తాలాకాకు చెందిన ఛోటు కుమార్, పవన్ కుమార్ సోమవారం ఉదయం బంగారు నగలకు మెరుగు పడతామంటూ తాడిపత్రి మండలం కావేటి సముద్రం గ్రామంలో సంచరించారు. వీరి మాటలు నమ్మి స్థానిక రైతు బెడదల రఘునాథరెడ్డి సోదరి పుష్పలత కొన్ని నగలను వారికి ఇచ్చింది. మెరుగు పెట్టిన తర్వాత నగల బరువులో వ్యత్యాసం రావడంతో అనుమానం వచ్చిన రఘునాథరెడ్డి కుటుంబసభ్యులు వెంటనే వారిని నిర్బంధించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆరా తీశారు. కెమికల్ సాయంతో నగలు కొంత మేర కరిగించి తీసినట్లు నిర్ధారణ కావడంతో నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో పుంగనూరు మండలం రామాపురం, కళ్యాణదుర్గంలోనూ మోసాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లుగా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

పావగడ: తాలూకాలోని కొత్తూరు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన రూరల్ సీఐ గిరీష్ ఆదేశాల మేరకు అరసికెరె పోలీసులు సోమవారం ఉదయం కొత్తూరు సమీపంలో తనిఖీలు చేపట్టారు. సాకమ్మనగుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతూ తొమ్మిది మంది పట్టుబడ్డారు. వీరి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ 2,22,290 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు అరసికెరె ఎస్‌ఐ తారాసింగ్ తెలిపారు.

పాముకాటుతో ఇద్దరి మృతి


మృతురాలు గంగమ్మ

అనంత జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పాము కాటుతో ఇద్దరు మృతి చెందారు. వివరాలు...

ఆత్మకూరు: మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన గంగమ్మ (58) పాము కాటుతో మృతి చెందింది. కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఆమె సోమవారం ఉదయం వేరుశనగ పొలంలో పని చేస్తున్న సమయంలో పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న తోటి కూలీలు ఆమెను వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, గంగమ్మ భర్త ఏడేళ్ల క్రితమే మరణించాడు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు కావడంతో గంగమ్మ పొలం పనులతో జీవనం సాగిస్తుండేది.

నిద్రిస్తుండగా పాము కాటు...


అనిల్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కాపర్లపల్లికి చెందిన అనిల్ (30) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తున్న ఆయన అర్ధరాత్రి సమయంలో కుటుంబసభ్యులను నిద్రలేపి తనకు ఏదో కుట్టినట్లుగా ఉందని తెలిపాడు. దీంతో కుటుంబసభ్యులు పరుపులు విదిలించి చూశారు. ఆ సమయంలో ఓ కట్ల పాము పరుపుల కింద నుంచి వేగంగా చీకట్లోకి వెళ్లిపోయింది. దీంతో బాధితుడిని వెంటనే నాటు వైద్యుని వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం పీహెచ్‌సీకి తరలించారు. చికిత్సకు స్పందించిక ఆయన మృతి చెందాడు. కాగా, అనిల్‌కు భార్య గాయత్రి, ఇద్దరు కుమార్తెలు, రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చౌడేశ్వరి ఆలయంలో చోరీ


ఆలయాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లిపల్లి గ్రామంలో వెలసిన చౌడేశ్వరి ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడిన దుండగులు 4 కిలోల వెండి ఆభరణాలు, హుండీని ఎత్తుకెళ్లారు. ఆరు బయలు నిర్మానుష్య ప్రాంతంలో హుండీని ధ్వంసం చేసి అందులోని రూ.6 వేల వరకూ నగదు అపహరించుకెళ్లారు. కాగా, ఆలయంలోకి ప్రవేశించిన వెంటనే దుండగులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లుగా తెలుస్తోంది. సోమవారం ఉదయం ఆలయం తలుపులు తీసి ఉండడం గమనించిన స్థానికులు చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ చంద్రశేఖర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. స్నిఫ్పర్‌డాగ్‌ను రంగంలో దించారు. క్లూస్‌టీం సాయంతో ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రూ.3.50 లక్షల అపహరణ


బాధిత రైతు వేణుప్రసాద్

ఉరవకొండ: పట్టపగలే ఉరవకొండలో చోరీ జరిగింది. ద్విచక్రవాహనంలో ఉంచిన రూ.లక్షల నగదు దుండగులు అపహరించుకెళ్లారు. వివరాలు... విడపనకల్లు మండలం ఉండబండ గ్రామానికి చెందిన రైతు వేణుప్రసాద్ ఇటీవల మిర్చి పంటను విక్రయించాడు. ఇందుకు సంబంధించిన రూ.3.50 లక్షల నగదు ఉరవకొండలోని ఎస్‌బీఐ శాఖలోని తన ఖాతాలో జమ కావడంతో సోమవారం ఉదయం బ్యాంక్‌కు చేరుకుని నగదు విత్‌డ్రా చేశాడు. అనంతరం నగదును తన ద్విచక్ర వాహనంలోని సైడ్ బ్యాగ్‌లో ఉంచుకుని స్వగ్రామానికి బయలుదేరిన ఆయన గవిమఠం ఆవరణలో ఉన్న బీరువాల తయారీ షాపు వద్ద వాహనం నిలిపి కొత్త బీరువా ఆర్డర్ ఇచ్చి వచ్చేలోపు వాహనంలోని రూ.3.50 లక్షలను దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ చుట్టుపక్కల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


చెల్లాచెదురుగా పడేసిన బీరువాలోని సామగ్రి

ధర్మవరం అర్బన్: స్థానిక లక్ష్మీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రి అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... లక్ష్మీనగర్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయుడు బాలాజీ ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి హుబ్లీకి వెళ్లాడు. విషయం గమనించిన దుండగులు ఆదివారం అర్ధరాత్రి తర్వాత తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. సోమవారం ఉదయం విషయం గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఇంటి యజమాని ఫోన్ నంబర్‌కు కాల్ చేసి చోరీ జరిగిన విషయాన్ని తెలిపారు. ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి గురించి ఆరా తీశారు. కాగా, మంగళవారం తాను ధర్మవరానికి వస్తున్నట్లు బాలాజీ తెలిపినట్లుగా సమాచారం. ఇంటి యజమాని వచ్చి ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.